# పచ్చకోడి

కోటప్పకొండ తిరునాళ్ళు చూసి ఇంటిముఖం పట్టాడు రిక్షా రాముడు కుటుంబంతో సహా. మధ్య త్రోవలో గాలివాన ప్రారంభం అయింది. సందె చీకట్లలో కంగారుగా ఇల్లు చేరుకున్నారు తడుస్తూనే.

గాలివానకు మేకలు చూరు ప్రక్కనే నిలబడి గోడ రుద్దుకుంటూ వుంటే, కోళ్ళు మాత్రం నులక మంచం మీద ముడుచుకొని పడుకున్నాయి. సక్కూబాయి ఇంటికి వస్తూనే ముందు మేకల్ని అదిలించి, కోళ్ళను గాబులోనికి తోలింది. చేతి సంచిని చూరుకు వ్రేలాడదీసింది. దానిలో తిరునాళ్ళలో కొన్న వస్తువులు, పళ్ళు వున్నాయి. పిల్లలకి బట్టలు మార్చి, ప్రొద్దున కాసిన గంజి కొంచెం త్రాగించి నిద్రపుచ్చింది. భర్త రాముల్ని గంజి త్రాగమంటే "నీ యవ్వ వానలో సద్ది గంజి ఏందే - ఏ కోడి కూరో నంజుకుంటూ నాలుగు పంచుల సారా తాగితే స్వరగం కనపడద్ది" అంటూ నసుగుతూనే కాస్త గంజి త్రాగి, నులక మంచంలో ముడుసుకొని పడుకున్నాడు. తెల్లవార్లు ఈదురు గాలివాన కురుస్తూనే వుంది.

తెల్లగా తెల్లారింది. వాన తగ్గినట్లు కాస్త వెలుగు సూర్యుడు జాడ తెలుస్తోంది. ప్రక్క ఇంటి కొండగాడు లగెత్తుకుంటూ వచ్చి "అత్తో! రాత్రి గాలివానకు మీ పచ్చకోడి ఎగిరి మా ఇంట్లో కొచ్చింది. అది మీదో కాదో అని మాయమ్మ అడగమంది' అన్నాడు రొప్పుతూ.

నిద్ర మంచం మీద రాములికి ఈ మాటలన్నీ వినిపిస్తూనే వున్నాయి.

"పచ్చకోడి ఏందిరా కొండా, మా కోళ్ళు అన్నీ ఈడనే వుండాయి. అది మాది గాదు" అంది సక్కూబాయి కళ్ళాపి కొట్టే పని లేదని తడి నేల మీద ముగ్గారవేస్తూ.

రాముడు ఠెంగున లేచి "ఆ కోడి మాదేరా కొండా. మీ అత్త ఒట్టి తెలివితక్కువది. దానికేమీ తెలవదు. ఎల్లి కోడిని పట్రా" అన్నాడు హుషారుగా వేపపుల్ల విరిసి నోట్లో పెట్టుకుంటూ. కొండడు కోడి కోసం లగెత్తాడు.

"ఏందయ్యా - మన కోళ్ళన్నీ వున్నాయి. అది మనది గాందే తేమంటివి ఎందుకు" అంది అయోమయంగా సక్కూబాయి.

"ఛ-నోరుముయ్యి. రాత్రి నుంచి కోడి కూర తినాలని నరాలు జివ్వున లాగేత్తున్నాయి. సుక్కేసుకుని కోడి మాంసం తినాల్సిందే ఈయ్యాల. నాయాల్ది కోడి ఎవరిదైతేనే ఊరికే వచ్చేది మనదే అంటే పోలే! మనమేమన్నా దొంగతనం చేశామా ఏటి" అన్నాడు.

"అత్తమ్మా ఇదిగో పచ్చకోడి మీదేగా" అంటూ చేతులతో ఓ కోడిని పట్టుకుని ఎదురుగా నిలబడ్డ కొండడ్ని చూసి మొగుడు పెళ్ళాలు నోళ్ళు వెళ్ళబెట్టారు. అది వారిదే గాని నిజంగా కోడి కాదు. నిన్న తిరువాళ్ళలో కొన్న రబ్బరు కోడి బొమ్మ.

సక్కూబాయి చూరుకు వ్రేలాడదీసిన సంచి వైపు చూసింది. దానిలో వున్న అరటి పళ్ళ కోసం మేకలు దాన్ని క్రిందకు లాగి చిందర వందర చేశాయి. మిఠాయిలు కోళ్ళు గెలుకుతూ తింటున్నాయి. సంచిలోని రబ్బరు కోడి బొమ్మ మాత్రం లేదు.

—బి. లక్ష్మీభాస్కర్

---

కృతజ్ఞతతో మహారాజా తన కుమార్తెకు ఇచ్చిన బహుమతి ఆ నెక్లెస్. ఏవో పరిస్థితుల కారణంగా నిజమైన నెక్లెస్ నకిలీ సరుకుగా మారిపోయింది.

అది ఎక్కడ జరిగి వుంటుంది?

మహారాజాకి ద్రోహం చేసి ఆయనతో గాజు పెంకులతో చేసిన నగని బహూకరింప చేసే ధైర్యం ఎవరికి వుంటుంది?

ఈ మోసం వల్ల ఎవరికి లాభం?

నిజమైన వజ్రాలూ, ఎమరాల్డ్స్ ఏమైపోయాయి?

ఫ్లాష్‌లాగా హార్డ్‌కి నిజం తెలిసింది.

ఓ యస్! అలా జరిగివుండాలి.

గోల్డ్ స్మిత్‌కి పది రూపాయిలు ఇచ్చి పంపేశాడు.

మనసు దిటవు పరచుకుని నిర్ణయం తీసుకుని లిజ్జీతో చెప్పాడు.

"ఈ నెక్లెస్‌ని మనం మహారాజాకి తిరిగి పంపేద్దాం."

"నీకేం పిచ్చెక్కిందా మార్టిన్?" అడిగింది భార్య.

"నో మై డియర్ నా మాట విను. ఈ చీప్ నగని మనం వుంచుకోవడంలో అర్థం లేదు. ఈ విషయం బ్రిటిష్ కమ్యూనిటీలో తెలిస్తే వాళ్ళు తెగ సంతోషపడడం అలా వుంచు, మనం నవ్వులపాలవుతాము. అలా కాకుండా రూలు విషయం తెలియచేసి ఓ ఉత్తరం రాసి మహారాజుకి ఈ నెక్లెస్‌ని పంపేస్తే ఆయనకు పరిస్థితి అర్థం చేసుకునే అవకాశం వుంది. డబ్బు కట్టే ఇంత విలువైన హారాన్ని మనం వుంచుకోలేమని ఆయనకు తెలియాలి. కారణాలు అందరికీ తెలియాలి. నూట యాభై రూపాయిలు ట్రెజరీలో కట్టి చవకబారు ఇమిటేషన్ గాజుముక్కల నెక్లెస్ వుంచుకోవడం ఫూలిష్‌నెస్. ఏమంటావు లిజ్జీ?"

"నీ ఇష్టం. ఏదో ఒకటి చేయి మార్టిన్."

ఎలిజబెత్ హార్డ్ నిట్టూర్చింది. భర్త చెప్పిన మాటలు అర్థమయ్యాయి ఆమెకు. ఆ వాదనలోని విజ్ఞతతో ఆమె ఏకీభవించింది. లేచి ఇంటిలోకి వెళ్ళింది. హనీమూన్‌కి వెళ్ళడానికి రెడీ అవుతున్న కుమార్తెతో ఈ దుర్వార్త ఎలాగో చెప్పాలి. పూర్ డియర్! ఎంత నిరుత్సాహపడుతుందో అనుకుంది తల్లి.

అదే సమయంలో తన స్టడీలో కూర్చుని మార్టిన్ హార్డ్ మహారాజా దిగ్విజయ్‌సింగ్ ఆఫ్ దేవీపూర్‌కి ఓ ఉత్తరం రాశాడు.

మై డియర్ మహారాజా,

నేమూ, నా భార్యా, నా కుమార్తె, అల్లుడు అందరమూ- మీరు ఎంతో శ్రమ తీసుకుని వివాహానికి మహారాణీవారితో వచ్చి విజయవంతం చేసినందుకు జీవితాంతం కృతజ్ఞులుగా వుంటాము. మీరు బహూకరించిన అమూల్యమైన బహుమతికి మేము ఏనాటికీ మీ ఋణం తీర్చుకోలేము.

కాని మా ప్రవర్తనా నియమావళి ననుసరించి కొత్తగా మా సర్వీస్‌లో పొందుపరచిన రూల్స్ ఇండియాలో ప్రస్తుతం పనిచేస్తున్న బ్రిటిష్ ఆఫీసర్స్ అందరికీ వర్తిస్తాయి. ఈ నూతన నిబంధనల ప్రకారం మేము ఎవరి వద్దనుంచి విలువైన బహుమతులను స్వీకరించడానికి వీల్లేదు. అందువల్ల మీరు అంత దయతో, ప్రేమతో కారొలైన్‌కి ఇచ్చిన వజ్రాల నెక్లెస్‌ని తీసుకుని మీ వద్ద వుంచుకోవడానికి మాకు శక్తి లేదు. దాని ధర చెల్లించని పక్షంలో ఈ నగ వైస్రాయిగారి ఆఫీస్ ట్రెజరీలో జమ చేయబడుతుంది. అది బ్రిటిష్ రాజవంశానికి చెందుతుంది.

'మహారాజా! మనం మిత్రులం. మీకు నా మీద అభిమానం వుంది. నమ్మకం వుంది. అలాగే మీరంటే నాకు ఎంతో వాత్సల్యం. ఎంతో గౌరవం. మన ఇద్దరి మధ్యా ఎలాంటి అపనమ్మకాలూ రాకూడదని నా నిశ్చయం. మీరు ఈ ఆభరణాన్ని తిరిగి తీసుకోవాలని నా ప్రగాఢమైన కోరిక. అది నా వద్ద వుండడానికి నాకు స్తోమత లేదు. కారొలైన్ అంత ఖరీదైన నెక్లెస్‌ని ధరించే అవకాశం లేదు.

నేను మన స్నేహానికి ఈ ప్రపంచంలోని అన్నింటికన్నా ఎక్కువ విలువ నిస్తాను. మీ సంస్థానంలో పనిచేసి మీ సలహాదారుగా సంస్థాన ప్రజలకు సేవ చేయగలగడం నా అదృష్టంగా, పూర్వ జన్మ సుకృతంగా భావిస్తాను. మీ చల్లని రాజ్యం, మీ మంచి ప్రజలు అందరూ ఎల్లప్పుడూ సుఖంగా వుండాలని కోరుకుంటాము. మళ్ళీ అవకాశం వస్తే సేవ చేయడానికి నేను సిద్ధం.

కాని చివరికి ఓ చిన్న సలహా.

హారాన్ని తిరిగి తమ ట్రెజరీలో భద్రపరిచేముందు ఈ హారంలోని వజ్రాల విలువ మరోసారి బేరీజు వేయించండి. ఎందుకైనా మంచిది. మధ్యకాలంలో ఏమైనా జరిగివుండ వచ్చును.

ఈ బేరీజు జరిగినప్పుడు తమ దివాను చాంద్‌వర్మ దగ్గర వుండేలా చూడండి. అతడికి అన్ని విషయాలు తెలుసు. వజ్రాల కిమ్మతు, ఇతర వ్యవహారాలు అతడివే కాబట్టి ఇలా చేయమని అర్థిస్తున్నాను.

ఎల్లప్పుడూ మీ మిత్రుడు,

మార్టిన్ హార్డ్, ఐ.సి.ఎస్.,
కమిషనర్, రామ్‌పూర్